క్లుప్తంగా

బీసీ సంఘం అధ్యక్షుడిగా దత్తు

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష పదవీకి ముగ్గురు నామినేషన్‌లు వేయగా ఇద్దరు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో అధ్యక్షుడిగా చిక్కాల దత్తు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రభాకర్ స్వామి తెలిపారు. ప్రధాన కార్యదర్శి పదవీకి ఐదుగురు నామినేషన్‌లు వేయగా.. ముగ్గురు విత్‌డ్రా చేసుకున్నారు. అసుర హన్మండ్లు యాదవ్, కలాల శ్రీనివాస్‌లు పోటీలో ఉన్నారు. వీరి ఈనెల 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు నుటంకి సత్యనారాయణ, పిల్లి కిషన్, పసుల ప్రతాప్, నవీన్ యాదవ్, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దారుల్ ఉలుం మహ్మదీయ 50వ వార్షికోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం దారుల్ ఉలుంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11న స్థానిక ఈద్గా మైదానంలో రాత్రి 8 గంటలకు వార్షికోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్, షాహిద్ అహ్మద్ తవక్కల్, సంయుక్త కార్యదర్శి మసూద్ ఖాన్‌పటేల్ పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గండ్రత్ రమేష్

ఆదిలాబాద్‌రూరల్: పిల్లలని పనిలో కాకుండా బడిలోనే ఉండాలని ఎంపీపీ గండ్రత్ రమేష్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని బాలల పరిరక్షణ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, శైలజ, తిరుపతి, సమీరుల్లా ఖాన్, దశరథ్, డేవిడ్, వినోద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాలనీలను అభివృద్ధి చేస్తాం



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీలోని కాలనీలను అభివృద్ధి చేస్తామని సర్పంచ్ సురేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం 6వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్ట పల్లవి, వార్డు సభ్యులు రాజమణి, వినయ్, కాలనీవాసులు విఠల్, శ్రీనివాస్, దశరథ్, నారాయణ ,దేవేందర్ పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల ఎంపిక కోసం లక్కీడ్రా



లక్కీ డ్రా తీస్తున్న ఎంపీడీవో సమద్

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మైనార్టీ రుణాల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. 117 మంది దరఖాస్తులు చేసుకోగా 2 యూనిట్లు ఉండడంతో ఎంపీడీవో అబ్దుల్ సమద్ డ్రా తీశారు. తేజాపూర్‌కు చెందిన మౌలానా రూ. 2 లక్షల యూనిట్, వాంకిడి గ్రామానికి చెందిన అనీస్ బేగంలకు రూ. 1లక్ష రూపాయల యూనిట్లు మంజూరయ్యాయి. రుణాలను బ్యాంకర్ల ద్వారా అందించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మానం

తాంసి: స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్న మండల పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి, వైస్ ఎంపీపీ రఘు, సదానంద్, అశోక్, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె) సర్పంచ్ మెస్రదేవురావు తల్లి మెస్రం గంగుబాయి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన గిరిజన మహిళ కోట్నాక్ జంగుబాయి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను మంగళవారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు పరామర్శించారు. వారి వెంట సార్‌మేడి మండాడి దౌలత్‌రావు, ఎంపీపీ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్, పూసం బాదిరావు, భీంరావు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం



బజార్‌హత్నూర్ ప్రభుత్వ పాఠశాల

- పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువు
- నత్తనడకన మనఊరు.. మనబడి పనులు
- అటకెక్కిన కంప్యూటర్ విద్య

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సమస్యలతో సతమతం అవుతోంది. పాఠశాలలో 257 మంది విద్యార్థులు, 11 మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం పాఠశాల ఆవరణం బురదమయంగా మారుతుంది. సరిపడా మరుగుదొడ్లు లేవు. మరుగుదొడ్లకు నీటి వసతి లేదు. మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు తాగడానికి నీళ్లు లేవు. 2009లో ఎడికామ్ కార్యక్రమం ద్వారా మంజూరైన కంప్యూటర్లు మూలనపడి పడ్డాయి. వాటికి మరమ్మతులు లేక అటకెక్కాయి. ఇప్పటి వరకు సైన్స్ ల్యాబ్ అందుబాటులోకి రాలేదు.

పనులు నత్తనడకన

మనఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అభివృద్ధికి రూ. 28 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కానీ పాఠశాల భవనంలో ఫ్లోరింగ్ విద్యుత్ పరికరాల బిగింపు చేశారు. ఇప్పటి వరకు రూ. 4లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారు. మిగతా పనులకు నిధులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. గ్రావెల్‌కు నిధులు కరువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో వసతులు కల్పించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



పాఠశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యార్థులు కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేవు. సైన్స్‌ల్యాబ్ లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. అధికారు లు, ప్రజాప్రతినిధులు స్పందించి వసతులు కల్పించాలి.

– ప్రత్యూష, ప్రధానోపాధ్యాయురాలు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దీంతో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మొదటి రోజు ధ్వజారోహణం, అర్చన, హోమం, అగ్నిప్రతిష్ట పూజలు నిర్వహించనున్నారు. చివరి రోజు వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తామని గంగయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

కంటివెలుగుపై అవగాహన కల్పించాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగుపై అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మంది కంటి పరీక్షలు చేయించుకున్నారో అడిగి తెలుసుకున్నారు. కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు మనోజ్, సూపర్‌వైజర్ సత్తవ్వ, డీఈవో మహేష్, అఫ్తలీక్ జయశ్రీ పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

ఇచ్చోడ: కంటివెలుగును పకడ్బందీగా నిర్వహించాలని కంటివెలుగు పరిశీలకులు ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని సిరిచెల్మలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించాలన్నారు.

తలమడుగు: మండలంలోని సాయిలింగి గ్రామంలో నిర్వహిస్తున్న రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం సార్క్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్‌కిరణ్ పరిశీలించారు. రోగులకు చేస్తున్న కంటిపరీక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యాధికారులు వినయ్, హరీష్, సర్పంచ్ పోచ్చన్న, సార్క్ మీడియా ఇన్‌చార్జి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో గంగారెడ్డి

నార్నూర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌హెచ్‌వో గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. ఈవ్‌టీజింగ్, అమ్మాయిలను వేధిస్తే భవిష్యత్ బుగ్గిపాలవుతుందన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బాలాజీ, రాథోడ్ శ్రీనివాస్, సుజాత, శారద పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై సునీల్ అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టబోంగరం గ్రామానికి సందర్శించి, యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ముందుగా పోలీసు సేవలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

పత్తాలేని పశువుల బీమా



- ఆరేళ్ల క్రితం ఎత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నష్టపోతున్న పాడి రైతులు

తాంసి: రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల కోసం అనేక పథకాలను చేపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమౌతోంది. వ్యవసాయంతో పాటు అనుబంధంగా పెంచుకునే పాడి పశువులకు బీమా సౌకర్యం కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పాడి పశువులకు బీమా ఉంటే ఏదైనా విపత్తుల వలన చనిపోతే పశువైద్యాధికారి ధ్రువీకరించి పశువును బట్టి రూ.50 వేల వరకు పరిహారం అందుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం భీమా పథకాన్ని ఎత్తి వేయడంతో రైతులు, పశువుల పెంపకందారులు నష్టపోవాల్సి వస్తోంది.

పశుసంపద వివరాలు..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులు అధిక సంఖ్యలో ఉన్నాయి. తాంసి మండలంలో 39321 పశువులు ఉన్నాయి. ఇందులో ఆవులు 8851, గేదెలు 2510, గొర్రెలు 10553, మేకలు7704, ఎద్దులు 9703 ఉన్నాయి. భీంపూర్ మండలంలో ఆవులు, గేదెలు 17000 వేలకు పైగా ఉండగా.. గొర్రెలు, మేకలు 14,000 వరకు ఉన్నట్లు పశు వైద్యాధికారుల లెక్కలు చెబుతున్నాయి.

బీమా కల్పిస్తే మేలు..

గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీలో ప్రభుత్వం మొదటిసారి బీమా సౌకర్యం సౌకర్యం కల్పించింది. ఏడాది ముగిసిన తర్వాత రెన్యూవల్ చేయకపోవడంతో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు కూడా ప్రస్తుతం బీమా లేకుండా పోయింది. గేదెలకు, ఎద్దులు, ఆవులు చనిపోతే రైతులు నష్టపోతున్నారు. గతంలో ప్రభుత్వం 50 శాతం, రైతుల వద్ద నుంచి 50 శాతం ప్రీమియాన్ని చెల్లించేది.

పాడి పరిశ్రమే జీవనాధారం..

తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని జామిడి, కప్పర్ల, గిరిగాం, బండల్ నాగాపూర్, హస్నాపూర్, పొన్నారి, నిపాని, పిప్పల్ కోటి, కరంజి(టి), అంతర్గాం, వడూర్, గోముత్రి, అందర్‌బంద్ గ్రామాలో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ జీవనాధారంగా మారింది. రైతులు అధిక సంఖ్యలో పాడి ఆవులు, గేదెలను పెంచుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీమా సౌకర్యం కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి

పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బీమా సౌకర్యం లేక రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం నావద్ద పదికి పైగా గేదెలు పెంచుతూ.. పాలను విక్రయిస్తున్నాను.

– వెంకట్ రెడ్డి, తాంసి

ప్రభుత్వం నిలిపేసింది

పశువుల బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపి వేయడంతోనే పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు కొంత, ప్రభుత్వం కొంత ప్రీమియం చెల్లించి బీమా చేసేవారు. గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వం నిలిపి వేసింది.

– శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి

క్రీడల్లో గెలుపోటములు సహజం



బోథ్: ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

బోథ్: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్లరాజు యాదవ్, బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జి సోయం వెంకటేష్, రైల్వే బోర్డు సభ్యులు జి.వి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్‌గా నిలిచిన 11స్టార్‌కు గొర్ల రాజు యాదవ్‌కు రూ.51 వేలు, రన్నరప్‌గా నిలిచిన వెపన్స్ యూత్‌కు జి.వి.రమణ రూ.31 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రవీందర్, అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, ముత్యం, సురేష్, తూము సూర్యం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సర్పంచ్ ప్రపుల్ చందర్‌రెడ్డి అన్నారు. రెడ్డి యూత్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ జాదవ్ అనిల్, కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్‌ల సహకారంతో తేజాపూర్‌లో నిర్వహించారు. ప్రథమ స్థానంలో కుంటాల, ద్వితీయ స్థానంలో తేజాపూర్ జట్లు నిలిచాయి. వారికి నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: బహుమతి అందజేస్తున్న సర్పంచ్

గ్రామాల్లో కొనసాగుతున్న గస్తీ

బోథ్: మండలంలో దొంగల భయంతో ఆయా గ్రామాల్లో గ్రామస్తులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు కర్రలతో కాలనీల్లో తిరుగుతున్నారు. ఇటీవల పొచ్చర గ్రామంలో బైక్ దొంగలించారు. సీసీ పుటేజ్‌లో దొంగలు తిరుగుతున్న దృశ్యాలు కనిపించడంతో అలర్ట్ అయ్యారు. పొచ్చర, ధన్నూర్, కనుగుట్ట, కొత గ్రామాల్లో గ్రామస్తులు గస్తీ పెంచారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.



గస్తీ నిర్వహిస్తున్న ధన్నూర్ గ్రామస్తులు

దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించాలి

కైలాస్‌నగర్: కొత్తగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగులకు అనువుగా ఉండేలా ర్యాంపులు నిర్మించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. గతంలో స్వీట్ వెండర్ షాపులను దివ్యాంగులకు కేటాయిస్తామని తెలిపారన్నారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించలేద న్నారు. ప్రతీనెల పెన్షన్ ఆలస్యం అవుతుందని, ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బావునే నగేష్, ఉగ్గే నానయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

టీటీయూ డైరీ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: టీటీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీని మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ , ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోగల సుదర్శన్, బద్దం సురేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కంది శ్రీనివాసరెడ్డి, సూర్య కాంబ్లీ, సత్యవాన్, వీరేందర్, గణేష్, అరుణ్ భగత్, మహేశ్, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. రక్షణ మరిచి

- ఎండిపోతున్న హరితహారం మొక్కలు
- పట్టించుకోని అధికారులు



కనుమరుగైన హరితహారం మొక్కలు

నార్నూర్: రాష్ట్రంలో అడవుల శాతం పెంచేందుకు, సకాలంలో వర్షాలు కురవాలని రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టింది. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. హరితహారంలో భాగంగా గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. లక్ష్యాన్ని చేరుకోవాలన్న హడావుడితో అధికారులు మొక్కలు నాటించి వాటి సంరక్షణ వదిలేశారు. నాటిన మొక్కలు ఎండకు ఎండుతూ.. పశువులకు ఆహారంగా మారుతున్నాయి. నార్నూర్‌లో 23, గాదిగూడలో 25, ఉమ్మడి మండలంలో మొత్తం 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నార్నూర్‌లో దాదాపు 1.80 లక్షలు మొక్కలు నాటారు. గాదిగూడలో 1.80 లక్షల మొక్కలు నాటారు.

అంతా ఆగమాగం..

- గతేడాది వానాకాలంలో నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో మొత్తం 45 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 15 వేల నుంచి 20 వేల మొక్కలు నాటారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ చేపట్టడం లేదు.
- అధికారులు హడావుడిగా గుంతలు తవ్వించి మొక్కలు నాటించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చెట్ల కింద ఒకటి నుంచి రెండేసి మొక్కలు నాటారు. అవి పెరగడం లేదు.
- గతంలో రోడ్ల పక్కన విద్యుత్ తీగల కింద మొక్కలు నాటించారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి తీగలకు అడ్డు రావడంతో ట్రాన్స్‌కో అధికారులు వాటిని నరికి వేస్తున్నారు.
- వాస్తవానికి మొక్క మొక్కకు రెండు మీటర్ల దూరంలో అడుగున్నర లోతు గుంత తవ్వించి నాటించాలి. పైపైన గుంత తీసి నాటడంతో ఈదురు గాలులకు, వర్షాలకు మొక్కలు కింద పడ్డాయి.
- రక్షణ కంచెలు వంగిపోయి, కింద పడి దర్శనమిస్తున్నాయి. కొన్ని మొక్కలు మూగజీవాలకు ఆహారంగా మారుతున్నాయి. మరికొన్ని మొక్కలకు నీరు పోయక ఎండిపోతున్నాయి.

చర్యలు చేపడుతాం



హరితహారం కార్యక్రమంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటాం. ఎండిపోకుండా చెట్లకు నీరు పోయిస్తాం. కిందకు పడిన రక్షణ కంచెలను తిరిగి చెట్లకు ఏర్పాటు చేయిస్తాం.మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– రమేశ్, ఎంపీడీవో నార్నూర్

పనుల్లో నాణ్యత పాటించాలి

బజార్‌హత్నూర్: మనఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఈఈ మహావీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తరగతి గదులలో ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధికి, వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శైలేందర్, ఏఈ నర్సింగ్, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఈఈ మహావీర్